# పాటలతో పాట్లు

కథానిక

—ఆదూరి వెంకటసీతారామమూర్తి

బస్సుకోసం ఎదురుచూస్తూ అరగంట అయింది.-కాళ్ళు లాగేస్తున్నాయి- ఇలా ఎదురుచూడడంలోనే సగం జీవితం గడచిపోతూంది-

నడచిపోయినా యీపాటికి యిల్లు జేరి పోదును.పోనీ ఆటోని తేకేద్దామన్నా మూడు రూపాయలకు తక్కువకి రాడు-రిక్షాకైనా అందులో సగమివ్వాలి -

చీకటి పడుతోంది!

అప్పుడే బజారు అందం చూడాలి; సూదుల దగ్గర్నించీ టెర్లిన్ చీరల వరకూ; పకోడీల దగ్గర్నించీ పనస పళ్ళ వరకూ అన్నీ ఫుట్‌పాత్ మీదే దొరుకుతాయి-

"ఇదిగో అబ్బాయ్. నీ దగ్గర అన్ని రకాల పాటల పుస్తకాలు వుంటాయా" తెలిసిన గొంతులా వుంటే తల త్రిప్పి చూశాను-ఎవరో ముసలాయన-ప్రక్కనున్న సినీమాపాటలపుస్తకాలమ్మేవాడిని అడుగుతున్నాడు-

''ఉన్నాయిబాబూ. ఏమిటి కావాలో చెప్పండి" అన్నాడువాడు-

నిజానికి ఆ వ్యాపారమే బాగుంది. అసలు-ఉద్యోగంకన్నా ఏవ్యాపారమైనా బాగానే ఉంటుంది - నేను నిల్చున్న అరగంటలోనూ సుమారొక పదిపాటల పుస్తకాలు అమ్మిఉంటాడు వాడు — ఈరోజుల్లో సిన్మాల మోజు అంతాఇంతా కాదు.

''చూడూ-బాగా అమ్ముడవుతున్న సిన్మా పాటల పుస్తకాలు కావాలి"అడుగుతున్నాడాయన - వయసు యాభై పైనే వుంటుంది.

"సీతాకళ్యాణం, శ్రీరామ పట్టాభిషేకం; కర్ణ...మీ ఇష్టం- ఏం కావలిస్తే అవే వున్నాయి చూడండి.''

"సర్లే- నాక్కావల్సినవి అవికావు-కుర్రాళ్ళు బాగా కొనుక్కుంటున్న పుస్తకాల్లేవూ...? అవీ....''

"అయీ వున్నాయి బాబూ-ముత్యాల ముగ్గు, మనూరిపాండవులూ, తూర్పువెళ్ళే రైలూ....కళ్యాణీ...''

''అవున్లే-అవి మంచివే-కాదన్ను. కానీ నాక్కావల్సినవి అవికావు-కుర్రాళ్లు తప్పట్లు చరిచి ఈలలేస్తూ పాడుకునే పాటలుండవ్- ఆ పాటల పుస్తకాలు కావాలి'' అన్నాడాయన వాడి మాటల కడ్డుతగుల్తూ-

ఆ తర్వాత

చుట్టూచూసి, నేను గమనిస్తున్నానని పసిగట్టి గొంతు తగ్గించి, అయోమయంగా చూస్తావేంటయ్యా ' ఇందా

యిందా తీసుకో ' "ఎత్తుకుంటావా నన్నెత్తమంటావా" "నువ్వు రమ్మంటే ఎన్నాడైనా రానన్నానా నువ్వడిగిందే నేనెన్నడైనా లేదన్నానా". అలాంటి పాటలు వినలేదయ్యా - అవీకావాలి "అన్నాడు- ఆ మాటలకు షాపువాడు ఘొల్లుననవ్వి," అర్థలా చెప్పండి. డబుల్ మీనింగుగల సాంగులన్న మాట. మరవిజెప్పడానికి సిగ్గుపడతారేం "అన్నాడు.

"డబుల్ మీనింగులని నువ్వనుకుంటున్నావు. కానీ నాకు వాటిల్లో ఒకే మీనింగు కన్పిస్తుంది" దానికి షాపువాడు నవ్వి, అవేటి బాబూ సొచ్ఛంగా బూతుకన్పిస్తుంటే' అన్నాడు విడమర్చి -

అవేనయ్యా - నాక్కన్పించిందీ ఆ మీనింగే - మరోమీనింగులేదు. అన్నాడాయన చుట్టూ చూస్తూ.

నా ఆశ్చర్యానికి అవధుల్లేవు. ఎవరో కుర్రకారు కొనుక్కున్నారంటే ఏదో సబబుగానే వుంటుంది - యాభైయ్యేళ్ళాయన బూతుపాటలకోసం ఆరాటపడుతున్నాడంటే ఆశ్చర్యమేసింది - అవును మరి! స్టాండర్డ్సు యిలా దిగజారుతున్నాయి కాబట్టే అటువంటి సాహిత్యం ఉత్పత్తి అవుతుంది - అటువంటిపాటల్నే ప్రజలు కోరుకుంటున్నారు కాబట్టే వాటినే సిన్మాలో చొప్పిస్తున్నాం అని తప్పుకుంటున్నారు నిర్మాతలూ, సంగీత దర్శకులూ-అటువంటి పాటలే రాయమంటున్నారు. కాబట్టి భుక్తికోసం రాయక తప్పటంలేదు అంటున్నారు కవీశ్వరులు-కానీ అందరు ప్రేక్షకులూ, అందరు శ్రోతలూ, అందరు నిర్మాతలూ కవులూ అట్లానే వున్నారా అంటే-అదీ లేదు! ఏది యేమైనా సకుటుంబంగా చూడతగ్గ సినిమాగాని, కుటుంబ సభ్యులంతా ఒకచోట కూర్చొని వినతగ్గ సినిమా పాటగాని కరువై పోతుందంటే ఆశ్చర్యంలేదు వీటన్నిటికీ తోడు కాలేజీ కుర్రాళ్ళు క్లాసులెగ్గొట్టి చూట్టానికి, మూపలీ ముతకా దాటుగా చూడ్డానికి అనువుగా నూన్‌షోలూ- సెక్స్‌చిత్రాలూ-

నా ఆలోచనలు పూర్తయ్యే సరికి ఓ దొంతు పుస్తకాలను సెలక్టు చేసి, యింకా గుర్తుకురాని పాటలను నెమ్మదిగా గుర్తు తెచ్చుకుంటూ అడుతున్నాడాయన.

ఒక్కసారిగా నాకందరి మీదా కోపమొచ్చింది.

ఏం ప్రయోజనం? ఈలోగ బస్సు కూడారానే వచ్చింది.

రెండ్రోజుల తర్వాత - ఓ సాయంకాలం గురజాడ మందిరంలో సభ జరుగుతూంటే ఏమిటోచని లోపలికి చూశాను- స్టేజిమీద అతను! మెళ్ళో పూలదండలు....ఆరోజు బూతు సిన్మా పాటలు పుస్తకాలు కొన్నఆసామీ-

అంతవరకూ మైకుముందు ప్రసంగిస్తున్న ఒకాయన ఒక్కసారిగా గొంతు మార్చి. దిగజారుతున్న నేటి సాహిత్య విలువలను గురించి శ్రీమురళీకృష్ణ గారు సోదాహరణంగా వివరిస్తూ చేసిన ప్రసంగం మన యువతకు చాల ఉపయోగిస్తుందని భావిస్తూ అందరితరఫునా ఆయనకు మా ధన్యవాదాలు తెల్పుకుంటున్నాం' అని చెప్పి దిగిపోయాడు.

నేను శిలాప్రతిమనే అయ్యాను!